క్లుప్తంగా

స్పెషల్ డ్రైవ్‌లో బైక్‌లు సీజ్



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని సుభాష్‌చౌరస్తాలో ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఉదయం 10 గంటల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్ ప్లేట్లు లేని బైకులు, మైనర్ బాలురు డ్రైవింగ్ చేస్తున్న బైక్‌లను ఆపి సీజ్ చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి బైక్‌లు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లకు నెంబర్ ప్లేట్లు బిగించాలని, మైనర్లకు బైకులు ఇవ్వకూడదని కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో బైక్‌లు పట్టుబడితే వాటిని సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భగీరథ పనులు ప్రారంభం



వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నతండాకు తాగునీటి వసతి కల్పించేందుకు మంగళవారం మిషన్ భగీరథ పనులు ప్రారంభమవ్వడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ తండాకు భగీరథ పైపులైన్ లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆయన ఆదేశాలతో పైపులైన్ పనులు ప్రారంభయ్యాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాతులవత్ గోపాల్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఇస్లావత్ కృష్ణ, సోమ్లా, నర్సింహ, సీతారాం, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొర్రం ట్రాక్టర్ల పట్టివేత



ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లిలో అనుమతులు లేకుండా తరలిస్తున్న మొర్రం ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. గ్రామంలోని రెడ్డి చెరువులో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని గ్రామంలోకి తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఎస్‌ఐ శ్రీహరి తమకు అప్పగించిన ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించాలి

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్ తదితర వ్యాధులపై ఆయా గ్రామాల వారీగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని గుర్తించి నెలవారీగా మందులు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యమహిళా కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకేంద్ర పరిధిలోని గ్రామాల ప్రజలకు 60 మందికి వైద్యపరీక్షలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజరు చంద్రన్న, ఫార్మాసిస్ట్ తిరుమల్‌రావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బస్సులు పునరుద్ధరించాలని వినతి

పెద్దకొత్తపల్లి: వెనచర్ల గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మాలమహానాడు వడ్డెర సంఘం ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వెంకటేష్ గౌడ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. నక్కలపల్లి నుంచి వెనచర్ల, నాగపూర్, కొత్తరాయిపాకుల, శానాయిపల్లి, గుడిపల్లి, ఔరేష్‌పల్లి, నాగనూల్ మీదుగా నాగర్‌కర్నూల్‌కు వెళ్లి నాలుగు ఆర్డినరి బస్సులు నడిపే వారని వివరించారు. ఈ బస్సులను రద్దు చేయడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. బస్సులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, లక్ష్మన్నస్వామి, సుబ్బయ్య, వడ్డెర సంఘం అధ్యక్షుడు నవీన్, నికిల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

కొల్లాపూర్: నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘం నూతనం కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని జైభీమ్ కాలనీలో గల నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయీబ్రాహ్మణులు సమావేశం అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఎస్.బాలరాజు, ఉపాధ్యక్షుడిగా తుపాకుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా తుపాకుల భరత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

యూనిఫాం తయారీతో ఉపాధి



మహిళలు కుడుతున్న యూనిఫాం తయారీని పరిశీలించిన జిల్లా అధికారులు (ఫైల్)

- విద్యార్థుల యూనిఫాం కుట్టు కూలి జతకు రూ.75
- మహిళ సంఘాలకు చేయూత
- కూలి రేటు పెంచాలంటూ వినతి



యూనిఫాం అందుకున్న విద్యార్థులతో మండల స్థాయి అధికారులు (ఫైల్)

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం యూనిఫాం అందిస్తోంది. గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు చేయూత కల్పించేందుకు ప్రభుత్వం యూనిఫాం కుట్టే పనిని వారికి అప్పగించారు.

మండల పరిస్థితి..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి దశలో 3,210 యూనిఫాంలు వచ్చాయి. మండల కేంద్రంతో పాటు దావాజిపల్లి, మాధరావుపల్లి, కేతేపల్లి గ్రామాల్లో మహిళా సంఘం సభ్యుల ద్వారా కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసి యూనిఫాం కుట్టారు. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా శక్తి టైలరింగ్ ద్వారా మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఎంపికచేసిన 33మందికి దుస్తులు కుట్టేందుకు మహిళలు ముందుకు వచ్చారు. ఒక్కొక్క యూనిఫాంకు ప్రభుత్వం రూ.75 చెల్లిస్తుంది.

కూలి పెంచాలి..

ప్రస్తుతం ప్రభుత్వం జతకు రూ.75 చొప్పున కూలి ఇస్తుందని, ఇది ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని మహిళలు వాపోతున్నారు. బయటి మార్కెట్‌లో ఇదే దుస్తులను కుట్టిస్తే రూ.500 వరకు చెల్లిస్తున్నారని, కనీసం మహిళా సంఘ సభ్యులకు యూనిఫాంకు రూ.200 ఇస్తే బాగుంటుందని మహిళలు వాపోతున్నారు.

వివరాలు ఇలా..

మండలం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	ఉపాధి పొందుతున్న మహిళలు
పాన్‌గల్	50	3,210	33
చిన్నంబావి	30	1,718	32
వీపనగండ్ల	26	1,633	26

చేతినిండా పని..



నేను పొదుపు సంఘాల్లో సభ్యురాలిగా ఉంటూ దర్జీగా పనిచేస్తున్నాను. గతంలో కుట్టాలని ఆసక్తి ఉన్నా మాకు ప్రభుత్వం ప్రోత్సహించలేదు. ఈ సారి సెర్ప్ అధికారుల సహకారంతో యూనిఫాం కుట్టే బాధ్యత తీసుకున్నాను. దీంతో మాకు చేతినిండా పని లభించింది. నాతో పాటు కొంత మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం ఇస్తున్న కూలి ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– జ్యోతి, దావాజిపల్లి, పాన్‌గల్ మం.

ఏడాదంతా పని కల్పించాలి



యూనిఫాం కుట్టే పని మహిళా సంఘాలకు ఇవ్వడం ద్వారా మాకు ఉపాధి లభిస్తుంది. నాతో పాటు చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇది ఇక్కడితో ఆగకుండా ఏడాదంతా పని ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అలాగే ఇచ్చే కూలి జతకు రూ.200 పెంచితే ప్రతిఫలం ఉంటుంది.

– ఎత్తం శారద, వీపనగండ్ల

సకాలంలో యూనిఫాంలు అందించారు



మహిళా సంఘాల ద్వారా పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాం వంద శాతం సకాలంలో అందించారు. ప్రస్తుతం ఒక్కొక్క జతను అందించారు. రెండో విడతలో మరో జత యూనిఫాం అందిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రతి నిత్యం పర్యవేక్షిస్తూ మహిళలు సకాలంలో దుస్తులు తయారు చేసేలా తమతో పాటు కార్యాలయం సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు దుస్తులు అందేలా చూశాం.

– సక్రూనాయక్, ఏపీఎం, పాన్‌గల్

‘రైతు నేస్తం’పై వీడియో కాన్ఫరెన్స్

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి రైతు భరోసా మీద వస్తున్న అపోహలను నివృత్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతుల నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విధానంపై రైతుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ విషయంలో కొందరు రైతులు 5 ఎకరాల వరకు అని మరికొందరూ రైతులు 10 ఎకరాల వరకు పరిమితి విధించాలని అభిప్రాయాలను తెలియపర్చారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, వర్షాధారిత పంటలైన మొక్కజొన్న, కంది, ప్రత్తి పంటల విత్తన సమయం, యాజమాన్య పద్ధతుల గురించి పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. మల్లారెడ్డి రైతులకు వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి వారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్ రహమాన్, ఏఈఓలు శైలజ, మహేశ్వరి, నరేష్, అఖిల, నరేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పెబ్బేరులో నాగుపామును బంధించిన కృష్ణసాగర్

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా సాగర్ స్నేక్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పెబ్బేరు నుంచి పాదయాత్ర చేపట్టారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. పోలీస్ సిబ్బంది అతడిని సన్మానించారు. పాదయాత్రలో ఉండగా మాజీ సర్పంచ్ జయశ్రీ ఇంట్లో నాగుపాము ఉందని సమాచారం ఇవ్వడంతో అతడు అక్కడికి చేరుకొని పామును బంధించి, ఎస్సీ కాలనీ ప్రజలకు, కంచిరావుపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యారర్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యశాఖ సీఎంఓ యుగేందర్, మహనంది, హెచ్‌ఎం సరస్వతి, రాములు, కార్యదర్శి బాలవెంకటన్న, ఆటవీశాఖ అధికారి రాణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

గ్రామాల్లో మొక్కలను నాటి సంరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని ఎంపీడీఓ రాఘవ సూచించారు. ఆయన మంగళవారం వనపర్తి మండలంలోని చిట్యాల తూర్పుతండా, పడమరతండా గ్రామాలల్లో నర్సరీలను పరిశీలించారు. చిట్యాలలో గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి సుస్మిత, మహేష్, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు అంబులెన్స్



వీపనగండ్ల సీహెచ్‌సీకి చేరిన అంబులెన్స్

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు మంగళవారం అధికారులు అంబులెన్స్ వసతి కల్పించారు. ఆస్పత్రికి అంబులెన్స్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలాల ప్రజలు కోరగా.. మంత్రి ఆదేశాల మేరకు అంబులెన్స్ వసతిని ఏర్పాటు చేశారు. అతి త్వరలోనే ఆస్పత్రిలో శుద్ధ జల వసతిని ఏర్పాటు చేయనున్నట్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల జిల్లా కోఆర్డినేటర్ చైతన్యగౌడ్ తెలిపారు. అంబులెన్స్ వసతి ఏర్పాటు చేయడంపై మంత్రి జూపల్లికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బీరయ్యయాదవ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, గోపి, కావలి మహేష్, ముంతరాజు, పోతుల వెంకట్‌రెడ్డి, అల్వూరు వెంకటేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలి



నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి ఒక్కరికీ బ్యాంక్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడులో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఆధ్వర్యంలో నగదు రహిత లావా దేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపాజిట్లు, డిపాజిట్ల ఖాతాలు, లావా దేవీల నిర్వహణ, ఖాతాలలోని అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదులు, పరిష్కార వ్యవస్థ, వయోవృద్ధులకు అందిస్తున్న బ్యాంకింగ్ సదుపాయాలు వంటి అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏదైనా లావాదేవీలలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోదండాపురం ఏఎస్‌ఐ సోఫీ, ట్రైనర్ మధుకృష్ణ, రవిసాగర్, లక్ష్మణ్, రాజు, పరుశ, సుధాకర్, హుస్సేన్, రాజశేఖర్ ఉన్నారు.

కంటి వైద్య శిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న 55 మందిలో 33 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని మండల వైద్యాధికారి రాజశేఖర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మురళి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో చిన్నంబావి, వీపగండ్ల మండలాల ప్రజలు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టింపు లేదు

గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లి చెరువులో ఇసుక తీసి అమ్ముతున్నారని రెవెన్యూ అధికారులకు సమాచారం రాగా సోమవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసులు సిబ్బందిని పంపారు. అక్కడ ఒకవైపు ఒండ్రుమట్టి, మరోవైపు ఇసుక తీస్తూ నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని గుర్తించి పట్టుకున్నారు. మరో జేసీబీ, రెండు ట్రాక్టర్లు పరారయ్యాయని, దొరికిన నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీని అక్కడే చెరువులో పంచనామా నిర్వహించి రిపోర్టు గోపాల్‌పేట తహసీల్దార్ ద్వారా పోలీసులకు అందించారు. సోమవారం రాత్రి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు గోపాల్‌పేట ఎస్‌ఐని సాక్షి వివరణ కోరగా రెవెన్యూ వారు రిపోర్టు ఇచ్చారు.. కానీ ఇంకా తీసుకురాలేదు. నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని తీసుకొచ్చి స్టేషన్‌కి తీసుకొస్తామని సమాధానమిచ్చారు.

వంతెనలు నిర్మించండి



గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల గుండా వెళ్లే వాగు

మానవపాడు: మండలంలోని గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల రైతుల పంటపొలాలకు వెళ్లేందుకు బొంకూర్ శివారు, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు శివారు పొలాలకు వెళ్లడానికి రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వాగుపై వర్షపునీరు ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో గోకులపాడు, చెన్నిపాడు గ్రామ రైతులు గతంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా పనులు చేపట్టలేదు. గతంలో ఎమ్మెల్యేలకు సైతం వినతిపత్రాలు అందించారు. చాలా సంవత్సరాలుగా రైతులకు ఉపయోగపడే రోడ్డు నిర్మాణాలను, వంతెనలు ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణాలు, వంతెనలు ఏర్పాటు చేయాలని, రైతులు కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

దుకాణాల వేలం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్ల పంచాయతీ కార్యాలయం సమీపంలో కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో 9 షాపులకు జులై 4న ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 27 నుంచి జులై 2 సాయంత్రం 5 గంటల వరకు కడుకుంట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలు ప్రతి షాపుకు ధరవాతు సొమ్ము రూ.20వేలు, దరఖాస్తు రుసుం రూ.500 పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కడుకుంట్ల పేరిట బ్యాంకర్ చెక్కు (ఏపీజీవీబీ), కడుకుంట్ల బ్యాంక్‌లో తీసిన డీడీలను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ వేలం రద్దు, వాయిదా వేయుటకు పూర్తి అధికారం గ్రామ ప్రత్యేక అధికారికి ఉంటుందన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతు జయప్రదం చేయండి

వీపనగండ్ల: మాదిగల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మందకృష్ణ మాదిగ 30ఏళ్లుగా అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. జులై 7వ తేదీన వరంగల్ పట్టణంలో నిర్వహించనున్న 30 ఏళ్ల మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. మాదిగల ఆత్మగౌరవంతో పాటు సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు మందకృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు పెన్షన్ల కోసం ఉద్యమం చేశారని, పసిపిల్లల గుండె ఆపరేషన్ల కోసం ఆరోగ్యశ్రీ పథకంలో చేర్పించిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరుగుతున్న కవాతు కార్యక్రమంలో లక్షలాది మంది మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రవివర్మ, రాజశేకర్, కృష్ణ, మహేష్, ప్రవీన్, రాములు, కరునాకర్, ఉదయ్‌కిరన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవం



కిష్టంపల్లిలో పోచమ్మ దేవతకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



అమ్మవారికి బలిచ్చే పొటేళ్లతో భక్తులు

అమరచింత: మండలంలోని కిష్టంపల్లిలో మంగళవారం పోచమ్మ దేవత బోనాల ఉత్సవాన్ని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి సంవత్సరం గ్రామ ప్రజలందరూ సమైక్యంగా బోనాల పండుగకు ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ గ్రామానికి చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద పోచమ్మ దేవతకు నైవేద్యంగా పొటేళ్లు, కోళ్లు బలిచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు వసతులను ఏర్పాటు చేశారు.

ఇది ప్రకృతి వనమే..



అమరచింత: ప్రభుత్వ ఖాళీ స్థలాలను వృథాగా వదిలివేయడంతో ప్రకృతి తన పని తాను చేసుకుంటూ పోతుందని చెప్పడానికి ఈ ఫొటోలో కనిపిస్తున్న పట్టణ ప్రకృతి వనమే నిదర్శనం. అమరచింత మున్సిపాలిటీలోని నాల్గో వార్డులో మూడేళ్ల కిందట ఆగమేఘాల కింద రూ.5 లక్షల ప్రతిపాదనలతో పట్టణ ప్రకృతి వనం ఏర్పాటు చేసి వాటికి జైభీమ్ పార్క్ అంటూ నామకరణం చేశారు. కానీ వాటిలో పూలు, పండ్ల మొక్కలు, పచ్చని గడ్డి పెంచకపోవడంతో వాటిలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి. విషయాన్ని అక్కడి కౌన్సిలర్ పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదు.

విద్యార్థులు చెడుకు దూరంగా ఉండాలి



అమరచింతలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌కుమార్



పెబ్బేరులో..



గోపాల్‌పేటలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న అధికారులు

అమరచింత: విద్యార్థులు మాదకద్రవ్యాల నియంత్రణలో ముందుండాలని, వీటి వల్ల కలిగే అనర్థాల గురించి కుటుంబ సభ్యులకు వివరించాలని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్‌ఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల యువతపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాలపై అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్‌ఎం కృష్ణవేణితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని గోపాల్‌పేట పోలీసులు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలీసులు కస్తూర్బా గాంధీ పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా వైపు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డ్రగ్స్‌తో అనర్థాలు

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్‌పై ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.